సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం । 1 । డిసెంబర్ । 2024



వాడివేడిగా కౌన్సిల్ సమావేశం

రాయచోటి మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం శనివారం వాడివేడిగా సాగింది. సమావేశానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. -8లో



ప్రజలపై విద్యుత్ భారం

చంద్రబాబు ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారం మోపి వంచనకు గురి చేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.340	రూ.400
రెండోరకం	రూ.230	రూ.336

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 134 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

అధికారులకు శిక్షణ

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో చేపట్టిన పనుల నుంచి తగ్గింపు చేసిన జీఎస్టీ, క్యూసీ, న్యాక్, లేబర్ సెస్ మొత్తాలను వెంటనే సంబంధిత శాఖల హెడ్ ఆఫ్ అకౌంట్లకు జమ చేసే విధానంపై అధికారులకు శిక్షణ ఇచ్చారు. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర జీఎస్టీ అధికారులు హాజరయ్యారు. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న పశువుల షెడ్లు, సీసీ రోడ్ల పనుల పురోగతిపై జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు సమీక్షించారు.

రేకుల షెడ్లు తొలగించకుంటే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ భాగ్యలత

గాలివీడు: ఆర్ అండ్‌బీ స్థలంలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్లను వెంటనే తొలగించకపోతే చర్యలు తప్పవని ఆక్రమణ దారులను ఉద్దేశించి తహసీల్దార్ భాగ్యలత హెచ్చరించారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం సర్వే నంబర్ 2266 లో నాలుగురోడ్ల కూడలి ఆక్రమణ దారులకు నోటీసులను జారీ చేసినట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం నోటీసులు అందించిన 15 రోజుల్లో ఆక్రమణలు తొలగించాలన్నారు. లేనిపక్షంలో పోలీసుల సహకారంతో ఆక్రమణలు తామే స్వయంగా తొలగిస్తామని స్పష్టం చేశారు.

సంబేపల్లె విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ శివప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఎకో సేఫ్ విత్ ఆక్వాసేఫ్ ప్రాజెక్టులో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నరసింహా రెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నెహ్రూ యువ కేంద్రం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో తమ పాఠశాలకు చెందిన తరుణ్‌కుమార్ గౌడ్,నాగచైతన్యరెడ్డి పాల్గొని ప్లాస్టిక్ వాడకాన్ని నివారించి పర్యావరణాన్ని పరిరక్షించే ఎకో సేఫ్ విత్ ఆక్వా సేఫ్ అనే ప్రాజెక్ట్‌ను ప్రదర్శించారన్నారు. అనంతరం గైడ్ ఓబుల్‌రెడ్డి, విద్యార్థులను జిల్లా విద్యాశాఖాధికారి శివప్రసాద్ రెడ్డి అభినందించారు.

8న క్రీడా జ్ఞాన్ పరీక్ష

కడప స్పోర్ట్స్: క్రీడాభారతి కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ 8వ తేదీన ఆన్‌లైన్ విధానంలో 4వ 'క్రీడా జ్ఞాన్ పరీక్ష' నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా డీఎస్‌డీఓ ఎస్. గౌస్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు, విద్యార్థులు, పేరెంట్స్, సిటిజన్స్ ఈ పరీక్ష రాసేందుకు ఆన్‌లైన్ ద్వారా క్రీడాభారతి.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో ఆధార్ నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పరీక్ష 8వ తేదీ ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటలలోపు ఎప్పుడైనా రాసే వెసులుబాటు ఉందన్నారు. 50 ప్రశ్నలు, 25 ని మిషాల సమయం ఉంటుందన్నారు. 12 సంవత్సరాలు పైబడిన వారందరూ అర్హులేనని పే ర్కొన్నారు. పరీక్షలో ప్రథమస్థానంలో నిలిచిన వారికి రూ.1 లక్ష, రెండోస్థానంలో నిలిచినవారికి రూ.50వేలు, మూడోస్థానంలో నిలిచిన వారికి రూ.25 వేలు, 4వ స్థానంలో నిలిచిన వారికి రూ.11 వేలు చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు.

విద్యాభివృద్ధే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సుబ్రమణ్యం

పీలేరు: విద్యాభివృద్ధే లక్ష్యంగా డిసెంబర్ 7న మెగా పేరెంట్ టీచర్ సమావేశాలు నిర్వహించనున్నట్లు డీఈఓ కె. సుబ్రమణ్యం అన్నారు. శనివారం స్థానిక కోటపల్లె జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ప్రాధాన్యతను గుర్తించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య మరింత సాన్నిహిత్యాన్ని ఏర్పరచడం లక్ష్యంగా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశాలు విద్యార్థుల భవిష్యత్తుకు కీలకంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల భాగస్వామ్యం పాఠశాల అభివృద్ధిలో ప్రాధాన్యత కావాలని తెలిపారు. ఆయా పాఠశాలలో చదివి ఉన్నత స్థాయికి చేరుకున్న వారి విజయగాథలను వివరించాలని తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరించాలని కోరారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అభాగ్యులకు బాసట!

- హెచ్‌ఐవీ బాధితులకు ఉచితంగా ఏఆర్‌టీ మందుల పంపిణీ
- తల్లి నుంచి బిడ్డకు సంక్రమించకుండా పీపీటీసీలో కాన్పులు
- నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం
- ప్రజల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు



కాలేజీలో అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది



మదనపల్లె సిటీ: తమ రోగాన్ని చెప్పుకోలేని అభాగ్యులు వారు... తెలిసోతెలియకో చేసిన తప్పునకు ప్రాణాంతక వ్యాధి బారినపడి నరకం అనుభవిస్తున్నారు. హెచ్‌ఐవీ సోకి ప్రాణాలతో పోరాడుతున్న అలాంటి వారికి ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (ఏపీ శాక్స్) అండగా నిలుస్తోంది. ఎయిడ్స్ నివారణకు పక్కాగా అడుగులు వేస్తోంది. కొత్త కేసులు నమోదు కాకుండా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. బాధితులకు ఏఆర్‌టీ సెంటర్ల ద్వారా చికిత్సలు అందిస్తోంది. ఏపీ శాక్స్ చేపట్టిన ప్రత్యేక చర్యలతో హెచ్‌ఐవీ కేసులు తగ్గుముఖం పట్టడంతో పాటు బాధితులకు భరోసా లభిస్తోంది. నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.....

- ప్రస్తుతం హెచ్‌ఐవీ నియంత్రణకు జిల్లాలో 'ఎయిడ్స్ నివారణ,నియంత్రణ సంస్థ' ఆధ్వర్యంలో బాధితులకు అవగాహన కల్పిస్తూ, అవసరమైన మందులందజేస్తూ వారి జీవితకాలాన్ని పొడిగించుకోవడానికి కృషి చేస్తోంది. పలు స్వచ్ఛంద సంస్థలు సైతం ఈ దిశగా తమదైన శైలిలో కృషి చేస్తున్నాయి. అయినా అవగాహన లోపం కారణంగా ఈ వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తూనే ఉంది. సురక్షితం కాని అక్రమ సంబంధాలు, స్వలింగ సంపర్కులు, తదితరుల ద్వారా వ్యాధి విస్తరిస్తోంది. జిల్లాలో ఎక్కువగా మదనపల్లె,రాయచోటి,పీలేరులో అధికంగా బాధితులు ఉన్నారు.

ఐసీటీసీ కేంద్రాలో పరీక్షలు, కౌన్సెలింగ్

ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ సెంటర్లలో హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. సెంటర్‌లో బాధితులకు కౌన్సెలింగ్ ఇస్తూ వారిలో మనోధైర్యం కల్పిస్తున్నారు. వారి జీవితకాలం పెంపు కోసం ఏఆర్‌టీ కేంద్రానికి పంపి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ఎంతో మందికి కౌన్సెలింగ్ ద్వారా వారి జీవితాల్లో మార్పులు తెస్తున్నారు.



పీపీటీసీ ద్వారా సేవలు

తల్లి నుంచి బిడ్డకు హెచ్‌ఐవీ సంక్రమించకుండా పీపీటీసీసీ ద్వారా కాన్పులు చేస్తోంది. హెచ్‌ఐవీ బారిన పడిన దంపతులు బిడ్డలకు కనాలంటే గతంలో ఎన్నో ఇబ్బందులు ఉండేవి. ప్రసత్తుం పీపీటీసీ కేంద్రాల్లో కాన్పులు చేసిన వెంటనే బిడ్డకు నివిరాపిన్ టానిక్ ఇవ్వడం ద్వారా తల్లి నుంచి బిడ్డకు హెచ్‌ఐవి సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఈ ఏడాది నినాదం

'నా ఆరోగ్యం... నా హక్కు అనేది ఈ ఏడాది నినాదం. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తిస్తూ వైద్యశాఖ, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అనుమానితులకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నారు. ఈ వ్యాధి విస్తరించటానికి వాహకులుగా ట్రాక్కర్స్, వలసదారులు, వితంతువులు, యువత, అనాథలు కారణమవుతున్నట్లు గుర్తించారు.

అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం



హెచ్‌ఐవీ ప్రబలకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలను చైతన్యవంతం చేయడమే కాకుండా వారికి అవగాహన కల్పించేందుకు తగిన కార్యాచరణ అమలు చేస్తున్నాం. ఎవరికైనా హెచ్‌ఐవీ సోకినట్లు అనుమానం కలిగిన వెంటనే ఐసీటీసీ కేంద్రాలకు వెళ్లి పరీక్షలు చేసుకోవాలి. హెచ్‌ఐవీ సోకిందని తెలిస్తే వైద్యులు సూచించినట్లు క్రమం తప్పకుండా మందులు వాడాలి.

–డాక్టర్ శైలజ, ఎయిడ్స్ నియంత్రణ అధికారిణి, అన్నమయ్య జిల్లా

ఐసీటీసీ కేంద్రాలు



తంబళ్లపల్లెలోని ఐసీటీసీ కేంద్రం

మదనపల్లె, వాల్మీకిపురం, పీలేరు, తంబళ్లపల్లె, బి.కొత్తకోట, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు,లక్కిరెడ్డిపల్లె

జిల్లాలో హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తుల వివరాలు

ఏడాది	హెచ్‌ఐవీ పరీక్షలు చేసుకున్నవారు	హెచ్‌ఐవీ నిర్ధారణ కేసులు
2022–23	57,817	380
2023–24 (అక్టోబర్ వరకు)	79,539	222



ఏడాది	హెచ్‌ఐవీ పరీక్షలు చేసుకున్న గర్భిణులు	హెచ్‌ఐవీ నిర్ధారణ కేసులు
2022–23	64,485	28
2023–24 (అక్టోబర్ వరకు)	29,968	4

జిల్లాలో హెచ్‌ఐవీ పాజిటివ్ కేసులు ఏఆర్‌టీ మందులు వాడే వారి సంఖ్య: **4,624**

జిల్లాలో సీఐల బదిలీలు

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో పలువురు సీఐలకు స్థానచలనం జరిగింది. ఈ మేరకు డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో బదిలీ అయిన సీఐల వివరాలు ఇలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా వీఆర్‌లో ఉన్న ఎ.చాన్‌బాషాను నంద్యాల డీటీసీకి, అన్నమయ్య జిల్లా వీఆర్‌లో ఉన్న టి బాబును వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట సర్కిల్‌కు బదిలీ చేశారు. ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజు కడప వీఆర్‌ఓకు బదిలీ అయ్యారు. అన్నమయ్య జిల్లా ఎర్రచందనం రక్షణ విభాగం నుంచి నరసింహులును పులివెందుల సీఐగా బదిలీ చేశారు. పులివెందులలో పనిచేస్తున్న సీఐ జీవన గంగనాథ్ బాబును అన్నమయ్య జిల్లా బి కొత్తపేట సర్కిల్‌కు, బి కొత్తపేట సీఐ కే రాజారెడ్డిని అన్నమయ్య జిల్లా ఎస్‌బీ-3కి బదిలీ చేశారు. అన్నమయ్య వీఆర్‌లో ఉన్న పి.సురేంద్రరెడ్డిని వైఎస్సార్ జిల్లా ఎస్‌బీ-2కు, అన్నమయ్య జిల్లాలో వీఆర్‌లో ఉన్న టి.మధును ఇదే జిల్లా ఎర్రచందనం రక్షణ విభాగానికి బదిలీ చేశారు. అన్నమయ్య జిల్లా ఎస్‌బీ-1లో టీవీ సత్యనారాయణను అన్నమయ్య వీఆర్‌కు, అన్నమయ్య ఎస్‌బి-3లో ఉన్న పి.రాజా రమేష్‌ను ఎస్‌బీ-1కు, అన్నమయ్య డీసీఆర్‌బీలో పనిచేస్తున్న జె శంకరయ్యను అన్నమయ్య వీఆర్‌కు, అనంతపురం వీఆర్‌లో ఉన్న ఎం.తులసీరామ్‌ను అన్నమయ్య డీసీఆర్‌బీకి బదిలీ చేస్తూ డీఐజీ ఉత్తర్వులను విడుదల చేశారు.

ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం

కడప రూరల్: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది నా ఆరోగ్యం.. నా హక్కు అనే నినాదంతో కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా డిసెంబరు ఒకటవ తేదీ నుంచి 15వ తేదీ వరకు పాఠశాలలు, కళాశాలలో హెచ్‌ఐవి ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమాలను నిర్మూలిస్తున్నట్టు చెప్పారు. డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం హెచ్‌ఐవి పాజిటివ్ పేషెంట్స్ కు నెలకు ఒకరికి రూ 4 వేలు చొప్పున పింఛన్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

మాకేంటీ తిప్పలు!



- సర్వే రాళ్ల తొలగింపునకు అప్పులు చేయాల్సి వస్తోందని సర్వేయర్ల ఆవేదన
- నిధులు మంజూరుకు ఎదురుచూపులు!

పెద్దతిప్పసముద్రం: సమగ్ర భూరక్ష కార్యక్రమంలో భాగంగా గతంలో జరిగిన రీసర్వేలో సర్వేయర్లు పొలాలకు వెళ్లి రైతులకు హద్దులు చూపుతూ రాళ్లు నాటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కక్షగట్టి నాటిన సర్వే రాళ్లలోని బొమ్మలను తొలగించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఆదేశాలయితే ఇచ్చారు గానీ.. రాళ్లు తొలగించేందుకు నిధులు మంజూరు చేయలేదు. దీంతో వాటిని తీయడానికి పడరాని పాట్లు పడాల్సి వస్తోందని పలువురు సర్వేయర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొమ్మల తొలగింపు కోసం ప్రభుత్వం ఇంత వరకు నిధులు కేటాయించక పోవడంతో ఇందుకోసం అయ్యే ఖర్చును సర్వేయర్లే భరించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రైవేటు వ్యక్తుల నుంచి మరీ అప్పులు చేసి తొలగించే పరిస్థితి నెలకొందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- అన్నమయ్య జిల్లాలో 30 మండలాలు ఉండగా 300ల మందికి పైగా రెవెన్యూ సర్వేయర్లు ఉన్నారు. జిల్లాలో మొత్తం అప్పట్లో 136 గ్రామాల్లో రీసర్వే పూర్తి కాగా అందులో 1.87 లక్షల సర్వే రాళ్లను పొలాల్లో నాటించారు. ఈ నేపథ్యంలో బొమ్మల తొలగింపు ప్రక్రియ 15 రోజుల నుంచి జరుగుతుండగా ఇప్పటి వరకు నానా తంటాలు పడి 40 వేల రాళ్లలోని బొమ్మలను తొలగించారు. ఒక రాయిలోని బొమ్మను తొలగించేందుకు ప్రభుత్వం రూ.15లు మాత్రమే కేటాయించగా క్షేత్ర స్థాయిలో మాత్రం తమకు రూ.20ల దాకా ఖర్చు వస్తోందని సర్వేయర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు జిల్లా అధికారులైతే ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని సమగ్రంగా ఆదేశాలు ఇస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితి మరోలా ఉంది. ప్రభుత్వం ఇచ్చే కూలి డబ్బులు తమకు గిట్టుబాటు కాదని పొలం పనికి వెళితే మధ్యాహ్న సమయానికే ఇళ్లకు చేరుకోవచ్చు అనే భావంతో కూలీలు ఉన్నారు. కూలీలను మరీ బతిమాలుకుని తొలగించాల్సిన దుస్థితి నెలకొందని సర్వేయర్లు పేర్కొంటున్నారు. ఈ ప్రక్రియకు సంభంధించి రాష్ట్ర ప్రభుత్వం నిధులను తక్షణం విడుదల చేసి కూలీలకు అయ్యే ఖర్చును పెంచి తమను అప్పుల బారి నుంచి విముక్తి చేయాలని పలువురు సర్వేయర్లు కోరుతున్నారు.

విజయవంతంగా ముగిసిన పోటీలు



విజేతగా నిలిచిన ఎస్పీ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



రాయచోటి డీఎస్పీ కృష్ణమోహనకు ప్రోత్సాహక బహుమతిని అందజేస్తున్న ఎస్పీ

- టగ్ ఆఫ్ వార్‌లో ఎస్పీ జట్టు విజయం
- అన్ని పోటీల్లో చాంపియన్‌గా నిలిచిన జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు జట్టు
- విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందజేసిన ఎస్పీ

రాయచోటి: అన్నమయ్య జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో మూడురోజులుగా నిర్వహించిన పోలీస్ వార్షిక ఆటల పోటీలు విజయవంతంగా ముగిశాయి. శుక్రవారం రాత్రి 11 గంటల వరకు ఆటల పోటీలు కనువిందుగా సాగాయి. ముగింపు వేడుకల కార్యక్రమానికి ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాగా టగ్ ఆఫ్‌వార్‌లో ఎస్పీ జట్టు విజయం సాధించింది. ఇక పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో వ్యక్తిగత చాంపియన్‌గా ఏఆర్‌పీసీగా శ్రీను నాయక్ నిలిచారు. ఓవరాల్ చాంపియన్‌గా జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు జట్టు నిలిచింది. స్పోర్ట్స్ మీట్‌లో విజేతలుగా నిలిచిన జట్టులకు ఇతర విజేతలకు ఎస్పీ ట్రోఫీలు, మెడల్స్, మెమెంటోలు, సర్టిఫికెట్స్ అందజేశారు. పోటీలు విజయవంతంగా నిర్వహించిన అధికారులకు ప్రత్యేకంగా అభినందించారు.

క్రీడలతో మంచి ఆరోగ్యం, ఉన్నతమైన ఆలోచనలు.....

నిత్యం క్రీడలలో పాల్గొంటున్న వారికి మంచి ఆరోగ్యంతోపాటు ఉన్నతమైన ఆలోచనలు వస్తాయని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరికీ క్రీడలు, వ్యాయామం ఒక భాగంగా ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ తమ శారీరక ధృడత్వాన్ని కాపాడుకోవడానికి ఏదో ఒక వ్యాయామం, క్రీడను అలవాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

ఫిజికల్ డైరెక్టర్లకు అభినందనలు

స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లకు ఎస్పీ అభినందనలు తెలిపారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం వెంకటాద్రి, రాయచోటి డీఎస్పీ ఎం ఆర్ కృష్ణమోహన్, మదనపల్లి డీఎస్పీ డి కొండయ్య నాయుడు, రాజంపేట డీఎస్పీ ఎన్ సుధాకర్, ఏఆర్ డీఎస్పీ బి చిన్నకృష్ణ, జిల్లాలోని సిఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది, ఫిజికల్ డైరెక్టర్లు, వైద్య బృందం పాల్గొన్నారు.

కారుమబ్బులు.. చిరుజల్లులు

- జిల్లాలో రోజంతా ఇదే వాతావరణం
- అక్కడకక్కడ జోరు వర్షం
- దట్టమైన పొగమంచుతో ప్రమాదకరంగా ప్రయాణాలు



గువ్వలచెరువు ఘాట్‌రోడ్డుపై కారుమబ్బులు, దట్టమైన పొగమంచు మధ్య వెళ్తున్న వాహనాలు

రాయచోటి: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా దట్టమైన పొగమంచు అలుముకుంది. ఆకాశం కారుమబ్బులతో నిండిపోయింది.. అప్పుడప్పుడు వర్షపు జల్లులతో నేలంతా తడిసింది. శనివారం రోజంతా ఇదే వాతావరణం కొనసాగింది. వారం రోజులుగా ఊరిస్తూ వచ్చిన తుపాను అన్నమయ్య జిల్లాలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు చిరుజల్లులతో సరిపెడుతోంది. జిల్లాలో పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసింది. ముఖ్యంగా రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల పరిధిలో ఓ మోస్తరుగా కురవగా, మిగిలిన ప్రాంతాలలో భూమిని తడి చేస్తూ వర్షపు జల్లులు కురుస్తున్నాయి. శనివారం రాత్రి 9 గంటల వరకు కూడా ఆకాశమంతా మేఘావృతమై జల్లులు పడుతూనే ఉన్నాయి. ఇక దట్టమైన పొగమంచు రావడంతో రహదారులపై వాహనదారుల ప్రయాణం కష్టతరంగా మారింది. ఏమాత్రం వేగంగా వెళ్లినా ఎదురుగా వచ్చే వాహనం కనిపించకుండా ప్రమాదం నెలకొనే అవకాశాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా జాతీయ రహదారుల్లో వాహనదారులు దట్టమైన పొగమంచుతో ఇబ్బందిపడ్డారు.

వణికిస్తున్న చలి:

తుపాను ప్రభావం కారణంగా వర్షంతో పాటు చలిగాలుల ప్రభావం అధికమైంది. నవంబర్ నెల ప్రారంభం నుంచే మంచు కురుస్తూ చలి తీవ్రత ఉన్న విషయం తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల్లో రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై వాతావరణంలో చల్లటి గాలులు వీచడంతో జిల్లాలో చలి తీవ్రత అధికమైంది. వృద్ధులు, చిన్నారులు చలికి గజగజ వణకాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.


అధికారుల అప్రమత్తత

తుపాను ప్రభావం కారణంగా భారీ వర్షాలు కురుస్తాయన్న సమాచారంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. వర్షాలు అధికమై ప్రజలు ఇబ్బందులు పడితే తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై కింది స్థాయి అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు.. (శనివారం రాత్రి 8 గంటల వరకు)

అన్నమయ్య జిల్లాలో అత్యధికంగా కోడూరులో 88.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఓబులవారిపల్లెలో 45.6, కేవీపల్లె 37.0, చిట్వేలి 33.8, పీలేరు 33, పుల్లంపేట 27 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో పెద్దతిప్ప సముద్రం, బి.కొత్తకోట మండలాల్లో మినహా మిగతా అన్ని మండలాల్లో వర్షం పడింది.

పింఛాకు మొదలైన ఇన్ ఫ్లో



పింఛా డ్యామ్‌కు చేరిన వరదనీరు

సుండుపల్లె: ఫెంగల్ తుపాను ప్రభావం వల్ల పింఛా డ్యామ్‌కు వరదనీరు చేరుతోంది. డ్యామ్ లెవల్ 987.40 అడుగులు ఉండగా, కెపాసిటీ 0.12664 టీఎంసీలు, ప్రస్తుతం 212 క్యూసెక్కుల నీరు చేరింది.

ఎడతెరిపిలేని వర్షం

ఓబులవారిపల్లె: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను తీరం దాటడంతో శనివారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మండల వ్యాప్తంగా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు చేరుతుంది. వర్షానికి ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. మండలంలో 45.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ కీర్తి తెలిపారు.

వైఎస్‌ఆర్‌సీపీ అనుబంధ విభాగాల కమిటీల బలోపేతం

– వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి



మార్గనిర్దేశాల పత్రాలు పరిశీలిస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట : వైఎస్‌ఆర్‌సీపీ అనుబంధ విభాగాల కమిటీలను బలోపేతం దిశగా కృషి చేస్తున్నామని వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ అనుబంధ విభాగాల కమిటీలకు మార్గనిర్దేశాలను సూచిస్తూ రూపొందించిన పత్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వైఎస్‌ఆర్‌సీపీకి అనుబంధంగా ఉన్న వివిధ విభాగాల కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులతోపాటు కమిటీలో ఉన్న వారందరికీ కూడా చైతన్య పరిచేలా సామగ్రి రావడం జరిగిందన్నారు. పార్టీకి గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నూతన తేజం కల్పించడం జరుగుతుందన్నారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పార్టీలోని అన్ని కమిటీల నాయకులు సంఘటితంగా పని చేయాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కాగా వైఎస్‌ఆర్‌సీపీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డికి పార్టీ అనుబంధ విభాగాల కమిటీలకు సంబంధించిన మెటీరియల్‌ను వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర సమైక్య కార్యదర్శి, కర్నూలు మాజీ గ్రంథాలయ చైర్మన్‌ సూభాష్‌ చంద్రబోస్‌ అందజేశారు. మెటీరియల్‌లోని వివిధ అంశాల గురించి పూర్తి వివరాలను తెలియజేశారు.

వాడివేడిగా కౌన్సిల్‌ సమావేశం

- పనుల ఆమోదం విషయంలో రగడ
- అధికారుల తీరుపై కౌన్సిలర్ల మండిపాటు
- మంత్రి ఆగ్రహంతో రభస



సభలో పాల్గొన్న కౌన్సిలర్లు, అధికారులు



ఆగ్రహంతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి అర్బన్‌ : రాయచోటి మున్సిపల్‌ కౌన్సిల్‌ సర్వసభ్య సమావేశం శనివారం వాడివేడిగా సాగింది. మున్సిపల్‌ పాలకవర్గం వైఎస్సార్‌సీపీది, రాష్ట్రంలో అధికారంలో కూటమి ప్రభుత్వం ఉండటంతో.. ఆ పార్టీల ప్రజాప్రతినిధుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. స్థానిక మున్సిపల్‌ సభా భవనంలో చైర్మన్‌ చిల్లీస్‌ ఫయాజ్‌బాషా అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. మొదటగా మున్సిపాలిటీ ఆటోలు, ట్రాక్టర్లకు డ్రైవర్లుగా పారిశుద్ధ్య కార్మికులను వినియోగించుకుంటూ.. వారికి కార్మికులకు వచ్చే జీతభత్యాలే చెల్లించడంపై చర్చ జరిగింది. సభ్యుల సూచనల మేరకు డ్రైవర్లుగా పని చేస్తున్న కార్మికులను ఆప్కాస్‌ కింద డ్రైవర్లుగా నమోదు చేయించి వారికి రూ.24,500 జీతం చెల్లించేలా చర్యలు తీసుకోవాలంటూ మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ ఫయాజుర్‌ రహిమాన్‌ డిమాండ్‌ చేశారు. కమిషనర్‌ వాసుబాబు స్పందిస్తూ ఆ మేరకు చర్యలు తీసుకుంటామంటూ చెప్పారు. అనంతరం 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టదలచిన పనులకు సభ ఆమోదం తెలపడంపై చర్చించారు. వైస్‌ చైర్మన్‌ ఫయాజుర్‌ రహిమాన్‌, కౌన్సిలర్‌లు కొలిమి హారూన్‌బాషా, చాన్‌బాషా, సాదక్‌అలీ మాట్లాడుతూ ప్రతిపాదిత పనులపై అభ్యంతరం తెలిపారు. కౌన్సిలర్లతో ముందస్తుగా చర్చించకుండానే ఇష్టారాజ్యంగా పనులు ఎలా ప్రతిపాదిస్తారంటూ కమిషనర్‌ వాసుబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కువ నిధులు కేటాయించిన పనులను కొన్ని వార్డులలోనే ప్రతిపాదించడం అన్యాయమని పేర్కొన్నారు. అధికారులే ఏకపక్షంగా పనులను ప్రతిపాదిస్తే ఇక తామెందుకు అంటూ మండిపడ్డారు. పనులను అన్ని ప్రాంతాలకు సమానంగా కేటాయిస్తే తప్ప తాము ఆమోదం తెల్పబోమంటూ పేర్కొన్నారు. వీరికి మిగిలిన కౌన్సిలర్లంతా మద్దతు పలికారు. కమిషనర్‌ వాసుబాబు స్పందిస్తూ ప్రాధాన్యత మేరకు పనులను ప్రతిపాదించామంటూ చెప్పినా సభ్యులు పట్టించుకోలేదు.

కబ్జాలపై విచారణ

మున్సిపల్‌ పరిధిలో కొనసాగుతున్న స్థలాల ఆక్రమణలు, ఆక్రమ కట్టడాలపై వెంటనే అధికారులతో విచారణ జరిపిస్తామంటూ మంత్రి చెప్పారు. సభా వేదికపై నుంచే కలెక్టర్‌కు ఫోన్‌ చేసి అక్రమాలపై విచారణ జరిపించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. అక్కడే ఉన్న డీఎస్పీ క్రిష్ణమోహన్‌ను సభలోకి పిలిపించి భూకబ్జాలపై వచ్చే ఫిర్యాదులపై స్పందించి పార్టీలకు అతీతంగా చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించారు. ఎక్కువ మంది కౌన్సిలర్లం ఉన్నామంటూ పనుల ప్రతిపాదనలకు అడ్డుపడడం తగదంటూ ఆగ్రహించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న తాము అలాగే అనుకుంటే ఎలా ఉంటుంది? అంటూ కౌన్సిలర్లను ప్రశ్నించారు. అభివృద్ధి పనులను ప్రతిపాదించే అంశంలో కౌన్సిలర్లు అధికారులతో సమన్వయంతో వ్యవహరించాలన్నారు. మంత్రి మాటలకు సమాధానం ఇచ్చేందుకు చైర్మన్‌ ఫయాజ్‌బాషా పలుమార్లు ప్రయత్నించడంతో సమావేశంలో 10 నిమిషాల పాటు రభస జరిగింది. మంత్రి ఆగ్రహావేశాలతో మాట్లాడుతున్నంత సేపు సభకు పెద్ద ఎత్తున విచ్చేసిన ఆయన అనుచర గణం, టీడీపీ నేతలు అరుస్తూ, కేకలు వేస్తూ, తప్పట్లు కొడుతూ అంతరాయం కలిగించారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి చేయూత

పట్టణంలో ఇష్టారాజ్యంగా చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులపై విచారణ జరిపించాలని మంత్రి సూచించారు. మంత్రి మాటలకు మున్సిపల్‌ చైర్మన్‌ ఫయాజ్‌ బాసా స్పందించి సదరు కాంట్రాక్టరును పిలిపించి కఠిన చర్యలు తీసుకోవాలని, అతని లైసెన్స్‌ రద్దు చేయించేలా చర్యలు తీసుకోవాలంటూ కమిషనర్‌ను కోరారు. పోలీస్‌స్టేషన్‌ వద్ద గల షిఫా ఆసుపత్రి వద్ద అసంపూర్తి కాలువను జాతీయ రహదారికి అనుసంధానంగా నిర్మించిన కాలువతో కలపాలని పేర్కొన్నారు. మంత్రి మాట్లాడుతూ చనిపోయిన పారిశుద్ధ్య కార్మికుల స్థానంలో ఆప్కాస్‌ ద్వారా వారి సంబంధీకులను నియమించుకోవాలని సూచించారు. రాయచోటి అభివృద్ధికి కృషి చేస్తున్నామని కౌన్సిలర్లందరూ తోడ్పాటు అందివ్వాలని అన్నారు. చైర్మన్‌ స్పందిస్తూ మున్సిపాలిటీ అభివృద్ధికి చేయూత ఇవ్వాలని మంత్రిని కోరారు. అర్బన్‌ పీహెచ్‌సీలలో మందుల కొరత ఉందని, వెంటనే తీర్చేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నా పట్టించుకోరేం?

గాలివీడు బఫర్‌జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా అపార్ట్‌మెంట్‌లు నిర్మిస్తుంటే ఎందుకు అడ్డుకోవడం లేదంటూ చైర్మన్‌ ఫయాజ్‌ అధికారులను ప్రశ్నించారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల మేరకు నిర్మాణాలు సాగుతున్నాయంటూ కొందరు కౌన్సిలర్లు ఆరోపించారు. ఒత్తిళ్ల కారణంగా పనులు ఆపలేకపోయామని, నిర్మాణదారులు సైతం తమను ఖాతరుచేయడం లేదని టౌన్‌ప్లానింగ్‌ అధికారిణి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. మంత్రి స్పందిస్తూ అధికార పార్టీకి చెందిన ఎవరు మీపై ఒత్తిడి తీసుకువచ్చారు? తానేమైనా మీపై ఒత్తిడి తెచ్చానా? చెప్పాలంటూ టీపీఓను సభా వేదిక వద్దకు పిలిపించి ప్రశ్నించారు. కొన్నేళ్లుగా వైఎస్సార్‌సీపీ వారే మున్సిపల్‌ పాలకవర్గంగా కొనసాగుతున్నారు కదా? అప్పుడెందుకు ఆక్రమణల గురించి పట్టించుకోలేదంటూ కౌన్సిలర్లపై మండిపడ్డారు. వెంటనే అక్రమ నిర్మాణాలపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించాలంటూ టీపీఓకు మంత్రి సూచించారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులపై బెదిరింపులకు దిగితే సహించబోమని, కేసులు నమోదు చేయిస్తామంటూ మంత్రి హెచ్చరించారు.

మెట్లపై నుంచి పడి వ్యక్తి మృతి

వీరపునాయునిపల్లె : మండల పరిధి అనిమెల గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలలో మెట్లు దిగుతుండగా కింద నుండి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలలోకి వెళితే .. గ్రామానికి చెందిన బత్తల బ్రహ్మయ్య(40)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శనివారం ఉదయం తేలికపాటి వర్షం కురుస్తుండటంతో నాలుగవ తరగతి చదువుతున్న కుమారుడు మల్లికార్జునను పాఠశాలలో వదిలేందుకు వెళ్లాడు. పైన ఉన్న తరగతి గదిలో పిల్లవాడిని వదిలి.. మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు కుటుంబీకులు తెలియజేశారు.

ట్యాంకర్‌ ఢీకొని అధ్యాపకుడి దుర్మరణం

ఎర్రగుంట్ల : మండల పరిధి పోట్లదుర్తి గ్రామంలోని శివాలయం వద్ద శనివారం ఫ్లైయాష్‌ ట్యాంకర్‌ ఢీకొని అధ్యాపకుడు దుర్మరణం చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరుకు చెందిన మల్లికార్జునరాజు(40) ఎర్రగుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పని చేసేవారు. రోజూ మాదిరిగానే ఉదయం ప్రొద్దుటూరులోని ఇంటి వద్ద నుంచి కళాశాలకు స్కూటర్‌లో బయలుదేరారు. పోట్లదుర్తి గ్రామ సమీపంలోని శివాలయం వద్దకు రాగానే ఫ్లైయాస్‌ ట్యాంకర్‌ వచ్చి ఢీకొంది. ఈ ప్రమదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి భార్య ఉష తోపాటు ఇద్దరు సంతానం ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రజలపై విద్యుత్‌ భారం మోపడం తగదు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్‌ : ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రజలపై విద్యుత్‌ చార్జీలు తగ్గిస్తామని చెప్పి, అధికారం చేపట్టిన 150 రోజుల్లోనే విద్యుత్‌ భారం మోపి వంచనకు గురి చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంపద సృష్టించి ప్రజలకు మేలు చేస్తామని చెప్పి.. అప్పులు చేస్తూ పథకాలు అమలు చేయకుండా సుమారు రూ.15835 కోట్లు విద్యుత్‌ సర్దుబాటు చార్జీల పేరుతో భారం మోపడం ఏమిటని ప్రశ్నించారు. కేవలం అప్పులు తెచ్చి ప్రజలకు ఏమీ చేయకుండా చంద్రబాబు దోచుకుంటున్నారని అనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఈ 5 నెలలు కేవలం ప్రశ్నించే వారిపై పీడీ చట్టం కేసులు పెట్టడం తప్ప చంద్రబాబు చేసిన పాలన ఏమీ లేదన్నారు. కూటమి సభలలో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ధరలు తగ్గిస్తాం, ఇంటింటికీ మేలుచేస్తాం, సూపర్‌సిక్స్‌ పథకాలు అందిస్తాం అంటూ ఊదర కొడుతూ పేద ప్రజలను నమ్మించి మోసం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రలో రెడ్‌బుక్‌ రాజ్యాంగాన్ని నడుపుతూ మహిళలకు, పేదల ఆస్తులకు రక్షణ లేకుండా చేస్తున్నారని తెలిపారు. మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలలో అన్ని రంగాలు అభివృద్ధి చెందాయన్నారు. చార్జీలు పెంచకుండా విద్యుత్‌రంగం, పోర్టులు, పరిశ్రమలు ఇలా అన్ని రంగాలు అభివృద్ధి చేశారన్నారు. పేదప్రజలకు గృహాలు, విద్య, ఆరోగ్యం, పథకాలు అందించడమే కాక కరోనా కష్ట కాలంలో ప్రజలను కాపాడారని అన్నారు.

ఎల్లో మీడియాకు కనపడలేదా?

రాష్ట్రంలో ఎల్లో మీడియాకు ఎదుటి వారిపై బురద చల్లడం అలవాటేనని తెలిపారు. రాష్ట్రానికి మేలు చేయడానికి సోలార్‌ ఎనర్జీపై కేంద్ర సంస్థ సెకీ నిబంధనల మేరకు అప్పటి ఏపీ ప్రభుత్వం యూనిట్‌కు రూ.2.40తో ఒప్పందాలు చేసుకొంటే.. దీనికి అమెరికాకు లింకులు పెడుతూ ప్రజలను పక్కదోవ పట్టించే విష ప్రచారం చేశారని విమర్శించారు. వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు రాతలు రాస్తున్నారన్నారు. ఇప్పుడు చంద్రబాబు మోపుతున్న భారాలు, తక్కువ కాలంలో చేసిన 69 వేల కోట్ల అప్పులు వారికి కనపడ లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్‌ సీహెచ్‌ రమేష్‌బాబు, నందాబాలా, బండారు మల్లికార్జున, డీవీ రమణ, నాయకులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధి 5 మండలాలలోని లోతట్టు, నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. తుపాను ప్రభావంతో రెండు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు రాత్రి సమయాలలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అధికారులు ప్రజలను అప్రమత్తం చేసి అన్ని సౌకర్యాలతో సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా గుంజనేరు పరివాహక ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని వివరించారు.

మండల మీట్‌ను అడ్డుకున్న కూటమి వర్గీయులు



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కూర్చున్న కూటమి నాయకులు

ములకలచెరువు : మండలంలో జరగాల్సిన అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా కూటమి నాయకులు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో మండల్‌ మీట్‌ను జరగనీయకుండా కార్యాలయం ఎదుట 100 మందికి పైగా తిష్ట వేశారు. కూటమి నాయకులకు వంత పలుకుతూ అధికారులు సైతం మిన్నుకుండిపోయారు. మండల్‌మీట్‌ కోసం అధికారులు మండలానికి చెందిన ఎంపీపీ, వైస్‌ ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలకు సర్క్యులర్‌ పంపించారు. వారు రాకముందే కూటమి నేతలు కార్యాలయం ఎదుట కుర్చీలు వేసుకొని తలుపులు మూసివేశారు. అక్కడికి వెళ్లిన ప్రజాప్రతినిధులను లోపలికి రానివ్వకుండా ప్రధాన ద్వారాలు సైతం మూసివేశారు. చేసేదేమీలేక ప్రజాప్రతినిధులు వెనుతిరిగారు. అధికార పార్టీ నాయకులకు వంతుపలికిన ఎంపీడీఓ హరినారాయణ మాత్రం మండల్‌మీట్‌ కోసం కోరం సమయానికి కార్యాలయానికి చేరుకోకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం కూటమి నాయకులు అక్కడి నుంచి నిష్క్రమించారు.

ముగిసిన అండర్‌-23 క్రికెట్‌ పోటీలు

కడప స్పోర్ట్స్‌ : కడపలో పది రోజులుగా నిర్వహించిన ఏసీఏ అంతర్‌ జోనల్‌ అండర్‌-23 వన్డే క్రికెట్‌ టోర్నమెంట్‌ శనివారం ముగిసింది. టోర్నమెంట్‌ ముగిసే సమయానికి రెస్టాఫ్‌ సౌత్‌జోన్‌ 12 పాయింట్లు, తూర్పుగోదావరి 12 పాయింట్లతో పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచాయి. కాగా చివరి రోజు శనివారం నిర్వహించిన మ్యాచ్‌లు తొలి ఇన్నింగ్స్‌ మాత్రమే పూర్తవగా, వర్షం కారణంగా మ్యాచ్‌లు నిలిచిపోవడంతో, ఫలితం తేలకపోవడంతో చెరో పాయింట్‌ కేటాయించారు.

అధికార పార్టీ తీరుపై ఆందోళన

- కలెక్టరేట్‌ ఎదుట ప్రజాప్రతినిధుల నిరసన
- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌, ఎస్పీకి ఫిర్యాదు



కలెక్టర్‌ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ములకలచెరువు ప్రజాప్రతినిధులు

రాయచోటి : అధికార పార్టీ బలం, అధికారుల అండతో మండల అభివృద్ధిపై చర్చ జరిపే సర్వసభ్య సమావేశాన్ని అడ్డుకుని అవమానపరచడంపై ములకలచెరువు మండలంలోని ప్రజాప్రతినిధులు నిరసిస్తూ అన్నమయ్య జిల్లా కలెక్టర్‌ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. శనివారం అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టర్‌ కార్యాలయం ఎదుట ములకలచెరువు ఎంపీపీ సాయిలీల, జెడ్పీటీసీ డి.మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీటీసీలు, సర్పంచులు అభివృద్ధిని అడ్డుకుంటున్న అధికార పార్టీ నాయకుల తీరును నిరసించారు. సర్వసభ్య సమావేశం నిర్వహణకు తగిన బలం ఉన్నా.. అధికార పార్టీ నాయకులు సమావేశంలోకి చొరబడి ప్రజాప్రతినిధులైన తమపై దాడి చేసి సభను అడ్డుకుంటున్నారని కలెక్టర్‌, ఎస్పీలకు ఫిర్యాదు చేశామన్నారు. సభ్యత్వం లేకపోయినా సమావేశానికి వస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినా.. వారు కూడా అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల కిందట నిర్వహించిన సర్వసభ్య సమావేశాన్ని అడ్డుకున్న ఈ నాయకులే శనివారం నిర్వహించిన సమావేశాన్ని అడ్డుకున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో నెలకొన్న అనేక సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై చర్చ జరగనివ్వకుండా అడ్డుపడుతున్నారన్నారు. అధికారులు కూడా వారికే మద్దతు తెలుపుతూ సర్వసభ్య సమావేశాలను వాయిదా వేస్తున్నారని కలెక్టరేట్‌ ఎదుట విలపించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు దౌర్జన్యాలు, దాడులకు పాల్పడుతూ అధికారులను సమావేశాలకు రానివ్వకుండా బెదిరిస్తున్నారన్నారు. ప్రజాప్రతినిధులమైన తమపైన కూడా దాడులకు తెగబడుతున్నారని పేర్కొన్నారు. గతంలో కూడా సర్వసభ్య సమావేశం అడ్డుకున్న విషయాన్ని జిల్లా కలెక్టర్‌ దృష్టికి తెచ్చామని, రెండో పర్యాయం అడ్డుకోవడాన్ని కూడా కలెక్టర్‌కు తెలియజేశామన్నారు. జిల్లా కలెక్టర్‌, ఎస్పీలు స్పందించి ప్రజల సమస్యల పట్ల చర్చించి పరిష్కార మార్గాలను చూపే సర్వసభ్య సమావేశాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ శ్రీధర్‌కు వినతిపత్రం ద్వారా ములకలచెరువు మండలంలోని ప్రజాప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ములకలచెరువు సర్పంచ్‌ మంజుల, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్‌



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఎరీషావలీ

మదనపల్లె : ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడి, విక్రయించి సొమ్ము చేసుకుంటున్న దొంగను పోలీసులు అరెస్ట్‌ చేశారు. స్థానిక వన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఎరీషావలీ వివరాలు వెల్లడించారు. కర్ణాటక ముళబాగల్‌కు చెందిన బాబూసాహెబ్‌ కుమారుడు సయ్యద్‌ అఫ్జల్‌(45) ఎనిమిదేళ్ల క్రితం మదనపల్లెకు వచ్చి స్థిరపడ్డాడు. పట్టణంలోని జ్యోతి సినిమా థియేటర్‌ ఎదురుగా రోడ్డుపై చెప్పుల వ్యాపారం చేస్తూ తరచూ ముళబాగల్‌కు వెళ్లివచ్చేవాడు. స్థానికంగా వ్యాపారం చేసుకుంటూ, మరోవైపు ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడేవాడు. దొంగలించిన వాహనాలను గుట్టుచప్పుడు కాకుండా విక్రయించేవాడు. ఈ క్రమంలో పట్టణంలో ద్విచ్రక్రవాహనాల చోరీకి సంబంధించి డీఎస్పీ కొండయ్యనాయుడు ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. శనివారం నక్కలదిన్నె వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, స్కూటీ వాహనంలో అటు వైపు వచ్చిన సయ్యద్‌ అఫ్జల్‌ పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. వాహనాల చోరీకి పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడించాడు. అతడి వద్ద నుంచి రూ.2.5 లక్షల విలువైన 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌ నిమిత్తం కోర్టుకు పంపినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ అన్సర్‌బాషా, హెడ్‌కానిస్టేబుల్‌లు శ్రీనివాసులు, శివ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌ అవినీతిపై విచారణ

మదనపల్లె : మదనపల్లె తహసీల్దార్‌ ఖాజాబీపై సమగ్ర విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా డిమాండ్‌ చేశారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 సెంట్ల భూమికి హక్కులు కల్పించేందుకు తహసీల్దార్‌ రూ.2 లక్షలు లంచం అడుగుతున్నారని మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి తనకు ఫిర్యాదు చేశారన్నారు. తహసీల్దార్‌ అవినీతికి సంబంధించి ఫోన్‌ పే, ఇతర ఆధారాలు, బాధితుల వివరాలతో సహా బయటపెట్టారన్నారు. దీంతో తాను జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. ఆయన సబ్‌ కలెక్టర్‌ మేఘస్వరూప్‌ను ఆదేశిస్తే, వీఆర్వోలందరినీ విచారణ చేసి రిపోర్ట్‌ కలెక్టర్‌కు పంపారన్నారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్‌ ఖాజాబీ, టీడీపీలోని కొందరు నాయకులతో కలిసి సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ మినిస్టర్‌ నారా లోకేష్‌ను కలిసి, తాను ఆమెను వేధిస్తున్నట్లుగా తప్పుడు ఫిర్యాదు చేసిందన్నారు. తహసీల్దార్‌ అవినీతికి సంబంధించిన అన్ని ఆధారాలతో బాధితులను నేరుగా సీఎం వద్దకు తీసుకెళ్లి జరిగిన విషయాలన్నింటినీ వివరిస్తానన్నారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్‌ చైర్మన్‌ నాదెళ్ల విద్యాసాగర్‌, శివ, బాలుస్వామి, ఎస్‌.ఏ.మస్తాన్‌, పులిమహాలక్ష్మి, రాధ తదితరులు పాల్గొన్నారు.

- అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న తహసీల్దార్‌ ఖాజాబీని కలెక్టర్‌ తక్షణమే సస్పెండ్‌ చేయాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి తోపుకృష్ణప్ప, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మీడియా సమావేశంలో కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా